సాక్షి జగిత్యాల

మంగళవారం । 18 । జూలై । 2023



తపస్ రాష్ట్రస్థాయి ఉద్యమం

జగిత్యాలటౌన్: విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 18 నుంచి దశలవారీ ఉద్యమానికి తపస్ కార్యాచరణ సిద్ధం చేసింది.



కొనసాగుతున్న నీటి విడుదల

బోయినపల్లి: మిడ్‌మానేరు నుంచి ఎల్‌ఎండీకి 2,300, కుడి కాల్వకు 200, ఎడమ కాల్వకు 30 క్యూసెక్కులు విడుదలవుతోంది.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
26.0/24.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సమస్యలు పరిష్కరించండి



నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

జగిత్యాలటౌన్: గురుకుల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తిరుక్కోవెల శ్యాంసుందర్, అంబటి భూమేశ్వర్ డిమాండ్ చేశారు. టీఎస్ యూటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట గురుకుల ఉపాధ్యాయులు నిరసన దీక్ష చేపట్టారు. వారు మాట్లాడుతూ అన్ని గురుకులాల్లో బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, పార్ట్‌టైం ఉపాధ్యాయులకు గురుకుల నియామకాల్లో వెయిటేజీ ఇవ్వాలని వారు కోరారు. ఆగస్టు 5న హైదరాబాద్‌లో నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు. నాయకులు గడ్డల శ్రీధర్, బల్ల సత్యనారాయణ, అనిల్, పద్మావతి, కృపసాగర్, సుమలత, రోజా, రమ్య, స్రవంతి, హరిత, రాము, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

'సీపీఎస్' రద్దు చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

జగిత్యాల: పీఆర్సీపై కమిటీ వేసి సీపీఎస్ విధానం రద్దు చేయాలని ఉపాధ్యాయ సంఘా పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక పురాతన పాఠశాలలో పోరాట కమిటీ భవిష్యత్ కార్యాచరణ ప్రచార పోస్టర్ విడుదల చేసి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్య, ఉపాధ్యాయ వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 18, 19 తేదీల్లో బైక్‌ర్యాలీ, ఆగస్టు 12న జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహిస్తామన్నారు. మూడోదశలో సెప్టెంబర్ 1న హైదరాబాద్ ఇందిరాపార్క్‌లో మహాధర్నా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్యామ్‌సుందర్, బోగ రమేశ్, రాంరెడ్డి, శంకర్‌బాబు, భూమేశ్వర్, రాంచందర్, నరేందర్, ప్రభాకర్, రఘుపతియాదవ్, చంద్రశేఖర్, గోవర్ధన్ పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరణ



పుష్పగుచ్ఛం అందిస్తున్న వెంకటస్వామి

జగిత్యాలక్రైం: జగిత్యాల డీఎస్పీగా వెంకటస్వామి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్పీ భాస్కర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇప్పటిదాకా పనిచేసిన డీఎస్పీ ప్రకాశ్.. హైదరాబాద్ డీజీపీ కార్యాలయానికి రిపోర్ట్ చేయగా ఖమ్మంలో పనిచేస్తున్న వెంకటస్వామి జగిత్యాలకు బదిలీపై వచ్చారు. కాగా, డీఎస్పీ ఉదయం కొండగట్టు శ్రీఆంజనేయస్వామిని దర్శించుకున్నారు.

ఐక్యతకు నిదర్శనం బీజేపీ కార్యకర్తలు



టిఫిన్ బైఠక్‌లో ఎంపీ అర్వింద్

మెట్‌పల్లి(కోరుట్ల): ఐక్యతకు నిదర్శనం బీజేపీ కార్యకర్తలని ఎంపీ అర్వింద్ అన్నారు. జిల్లా సరిహద్దులోని గండి హనుమాన్ ఆలయ ఆవరణలో సోమవారం బీజేపీ మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా సోమవారం టిఫిన్ బైఠక్ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత ఆలయంలో పూజలు చేసిన ఆయన.. ఆ తర్వాత కార్యకర్తలతో కలిసి అల్పాహారం చేశారు. అనంతరం ఎంపీ అర్వింద్ మాట్లాడారు. బీజేపీ కార్యకర్తలు నిబద్ధతతో సేవలు అందిస్తూ కుటుంబంగా కలిసి ఉండడం పార్టీకి గర్వ కారణమన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పైడిపల్లి సత్యనారాయణరావు, నియోజకవర్గ కన్వీనర్ చెట్లపల్లి సుఖేందర్, మాజీ జెడ్పీటీసీ జేఎస్ సునీత, మండల అధ్యక్షుడు కొమ్ముల రాజ్‌పాల్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు బొడ్ల రమేశ్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దొనికెల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆవేదన.. ఆందోళన



బీర్‌పూర్‌లో మహిళల నుంచి వివరాలు తెలుసుకుంటున్న అధికారులు(ఫైల్)

- రుణాలు తీసుకోకుండానే తీసుకున్నట్లు నోటీసులు
- బోగస్ సభ్యుల పేర్లతో రూ.14.50లక్షల దుర్వినియోగం
- విచారణ జరిపి నిజమేనని తేల్చిన అధికారులు
- బాధ్యులైన ఉద్యోగులపై వేటు.. మళ్లీ విధుల్లోకి
- అసహనం వ్యక్తం చేస్తున్న మహిళా సంఘాల సభ్యులు

సారంగాపూర్(జగిత్యాల): జిల్లాలోని బీర్‌పూర్ మహిళా సంఘాల సభ్యుల్లో ఒకవైపు ఆందోళన, మరోవైపు ఆవేదన వ్యక్తమవుతోంది. గ్రామైక్య సంఘంలోని స్వశక్తి మహిళా సంఘాల నిధులు అక్రమ మార్గంలో కొందరి చేతుల్లోకి వెళ్లాయనే విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. విచారణ జరిపిన అధికారులు.. బాధ్యులుగా తేలిన ఉద్యోగులను దాదాపు అర్నెల్ల క్రితమే సస్పెండ్ చేశారు. కానీ, ఈ వ్యవహారంలో ఎలాంటి సంబంధంలేని ఏపీఎంను సెర్ప్ రాష్ట్ర కార్యాలయానికి సరెండర్ చేయడంపై మహిళలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కారణం లేకుండా సరెండ్ చేశారంటూ ఇటీవల కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశారు.



రుణం తీసుకున్నట్లు సభ్యురాలికి ఇచ్చిన నోటీసు

29 సంఘాలు.. 450మంది సభ్యులు..

- బీర్‌పూర్ గ్రామైక్య సంఘంలో 29 మహిళా స్వశక్తి సంఘాలు ఉన్నాయి.
- ఇందులో 450 మంది వరకు మహిళలు సభ్యులుగా ఉన్నారు.
- 2017–18 సంవత్సరంలో స్త్రీనిధి నుంచి ఆయా సంఘాలకు రూ.14.50 లక్షల వరకు రుణం మంజూరైంది.
- ఇందులో కొన్నిసంఘాలు రుణం తీసుకోవడానికి విముఖత వ్యక్తం చేశాయి.
- అయినా, రికార్డుల్లో ఆ మహిళా సంఘాలు రుణం తీసుకున్నట్లు నమోదైంది.

రికవరీ చేయకుండానే విధుల్లోకి..

సుదీర్ఘంగా విచారణ జరిపిన అధికారులు.. అక్రమార్కులను గుర్తించి సస్పెండ్ చేశారు. కానీ, నిధులు రికవరీ చేయకుండానే మళ్లీ విధుల్లోకి తీసుకున్నారని మహిళా సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఇటీవల బీర్‌పూర్ మండల కేంద్రంలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలపడంతో వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. అంతేకాదు.. నిధుల గోల్‌మాల్‌పై విచారణ జరపాలని ప్రజావాణిలోనూ ఫిర్యాదు చేశారు.

- మరికొందరు రుణం తీసుకుని సకాలంలో రుణవాయిదాలు చెల్లిస్తూ వచ్చినా చెల్లించనట్లు రికార్డుల్లో ఉంటోంది.
- అంతేకాదు.. బకాయిలు చెల్లించాలని సెర్ప్ కార్యాలయం నుంచి వీరికి ఇటీవల నోటీసులు కూడా జారీ అయ్యాయి.
- వాటిని అందుకున్న మహిళలు.. తాము రుణాలు తీసుకోలేదని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.
- విచారణ జరిపిన అధికారులు.. సెర్ప్‌లోని పలువురు ఉద్యోగులను 2022 ఆగస్టు 26న సస్పెండ్ చేశారు.
- దీంతోపాటు ఎవరు, ఎంత రుణం తీసుకున్నారు, ఎంత తిరిగి చెల్లించారు, బకాయిలు ఎన్ని ఉన్నాయి, ఇందులో స్త్రీనిధికి చెల్లించాల్సిన సొమ్ము ఎంత? అనే వివరాలు సేకరించారు.
- అప్పు తీసుకోని వారి వివరాల జాబితా కూడా రూపొందించారు.
- అయితే, పక్కదారి పట్టిన సొమ్ము ఎవరి ఖాతాలోకి వెళ్లింది, ఎలా సర్దుబాటు చేశారు? అనే అంశాలపై విచారణ జరపాలని పలువురు మహిళలు కోరుతున్నారు.
- మరోవైపు.. స్త్రీనిధి నుంచి రుణంగా తీసుకున్న రూ.14.50 లక్షలు పక్కదారి పట్టాయని, అందులో రూ.11 లక్షల వరకు సభ్యులు తిరిగి చెల్లిస్తే రూ.3 లక్షల వరకు వడ్డీమాఫీ కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదిస్తామని అధికారులు అంటున్నారు.

నోటీసు ఇచ్చారు



నేను ఎక్కడా లోన్ తీసుకోలేదు. కానీ, రూ.50,800 తీసుకున్నట్లు, కొంత చెల్లించినట్లు, రూ.43,201 బాకీ ఉన్నట్లు చెబుతున్నరు. కాయకష్టం చేసుకుని బతికేటోళ్లం. అప్పు చేయకున్నా చేసినట్లు అధికారులు నోటీసులు ఇవ్వడం సరికాదు.

– చీర్నేని రగుణ, బాధితురాలు, బీర్‌పూర్

అప్పు తీసుకోలే



మహిళా సంఘం నుంచి నేను ఎప్పుడూ అప్పు తీసుకోలేదు. కానీ, నేను రూ.50,800 తీసుకున్నట్లు రికార్డుల్లో ఉందట. రూ.43,214 బకాయి ఉన్నట్లు నోటీసులు వచ్చినయి. ఇదిపూర్తిగా అన్యాయం. దీనిపైఅధికారులు విచారణ జరపాలె.

– బసవరాజుల శంకరవ్వ, బాధితురాలు, బీర్‌పూర్

సమస్య పరిష్కరిస్తాం



మహిళా సంఘాల్లో రుణాలు తీసుకోకున్నా తీసుకున్నట్లు జారీఅవుతున్న నోటీసులపై మహిళలు ఆందోళన చెంద వద్దు. నిధుల దుర్వినియోగంపై ఉన్నతాధికారులు సమీక్షిస్తున్నారు. ఎవరికీ నష్టం కలుగకుండా చూస్తాం.

– రాజయ్య, ఏపీఎం, సెర్ప్, బీర్‌పూర్

మారని వైద్యుల తీరు

- సమయపాలన పాటించని డాక్టర్లు
- పట్టించుకోని వైద్య, విధాన పరిషత్ అధికారులు
- ఇబ్బందులు పడుతున్న పేషెంట్లు

రాయికల్(జగిత్యాల): వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు రెండ్రోజుల క్రితమే జిల్లా కేంద్రంలోని మాతా శిశు సంరక్షణ కేంద్రంలో తనిఖీలు చేశారు. ఆ సమయంలో విధులకు గైర్హాజరైన పలువురు వైద్యులకు మెమోలు జారీచేశారు. ఈవిషయం మరువకముందే స్థానిక వైద్య, విధాన పరిషత్ పరిధిలోని ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు విధుల్లో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించడంపై పేషెంట్లు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

మధ్యాహ్నం 12.30 గంటలకు ఇంటిదారి..

- స్థానిక వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆస్పత్రి ద్వారా ప్రజలకు వైద్య సేవలు అందిస్తారు.
- పట్టణంతోపాటు, మండలంలోని 32 గ్రామాల ప్రజలకు ఇదే ఆస్పత్రి పెద్దదిక్కు.
- ఆస్పత్రి సూపరింటెండెంట్ రవికుమార్, డీజీవో ఒడ్నాల రజిత, ఈఎన్‌టీ రమేశ్, రేడియాలజిస్ట్ సురేందర్, మెడికల్ ఆఫీసర్ తేజస్వీ విధులు నిర్వర్తిస్తున్నారు.
- అయితే, పేషెంట్ల సమాచారం మేరకు సోమవారం మధ్యాహ్నం 12.30 గంటలకు 'సాక్షి' ఆస్పత్రిని సందర్శించింది.
- ఆ సమయంలో విధుల్లో ఉండాల్సిన సూపరింటెండెంట్ రవి, స్త్రీవైద్య నిపుణురాలు ఒడ్నాల రజిత ఒకరితర్వాత ఒకరు ఆస్పత్రి నుంచి బయటకు వెళ్లిపోయారు.



మధ్యాహ్నం 12.30 గంటలు : ఖాళీగా డాక్టర్ గది

- ఈవిషయం తెలుసుకున్న డాక్టర్ రవి తిరిగి ఆస్పత్రికి చేరుకున్నారు.
- రోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిబంధనల ప్రకారం పేషెంట్లకు వైద్యసేవలు అందించాలి.
- కానీ, కొందరు వైద్యులు తమ ఇష్టానుసారంగా విధులు నిర్వర్తిస్తున్నారని పలువురు పేషెంట్లు ఆరోపిస్తున్నారు.
- దీంతో వైద్యసేవల కోసం వస్తున్న పేషెంట్లు.. వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నారు.
- ఆర్‌బీఎస్‌కేలో పనిచేస్తున్న డాక్టర్ మౌనికను వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించి మిగతా కొందరు వైద్యులు ఆస్పత్రి నుంచి బయటకు వెళ్లిపోయారు.
- ఇలా వైద్యులు సరిగా విధులు నిర్వహించకపోవడంతో ప్రసవాల సంఖ్య తగ్గుతోందనే అపవాదు ఎదుర్కొంటున్నారు.
- పర్యవేక్షించాల్సిన సూపరింటెండెంట్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు కూడా ఉన్నాయి.
- ఇటీవల కాంగ్రెస్ ఆధ్వర్యంలో వైద్యుల పనితీరుకు నిరసనగా ధర్నా కూడా చేశారు.

సమయపాలన లేదు



వైద్య విధాన పరిషత్ ఆస్పత్రి సూపరింటెండెంట్, డీజీవో, వైద్యులు విధుల్లో సమయపాలన పాటించడం లేదు. ఒకరు వెళ్తున్నారని మరొకరు వారిని అనుసరిస్తున్నారు. ఇది ఆస్పత్రిలో ఆనవాయితీగా మారింది. పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు.

– మ్యాకల అనురాధ, కౌన్సిలర్, రాయికల్

చర్యలు తీసుకుంటాం



సమయపాలన పాటించని వైద్యులపై చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సమయపాలన, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉన్నతాధికారులకు నివేదిస్తాం. ఆస్పత్రిలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నాం.

– రవి, ఆస్పత్రి సూపరింటెండెంట్

ఉచిత విద్యుత్‌పై రెఫరెండానికి సిద్ధం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: వ్యవసాయ రంగానికి ఇస్తున్న నిరంతర ఉచిత విద్యుత్‌పై నిజానిజాలు తెలుసుకునేందుకు ప్రభుత్వం రెఫరెండం నిర్వహిస్తే కాంగ్రెస్ పార్టీ అందుకు సిద్ధంగా ఉంటుందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. స్థానిక ఇందిరాభవన్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్నీ తానై ప్రభుత్వాన్ని నడిపిస్తున్న మంత్రి కేటీఆర్‌కు.. హామీ మేరకు రూ.లక్ష పంట రుణమాఫీ అమలు చేయాలనే బాధ్యత లేదా? అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీకి ఎడ్లు, వడ్లు తెలియదని కేటీఆర్ వ్యాఖ్యానించడం సరికాదన్నారు. 2004లో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్ ఇచ్చిందని, అప్పుడు కేటీఆర్ ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. ఏనాడూ 12గంటలకు మించి త్రీఫేజ్ కరెంట్ సరఫరా చేయని ప్రభుత్వం.. ఉచిత విద్యుత్ అంశం వివాదాస్పదం కావడంతో ఈనెల 11 నుంచి 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తోందని, ఈ సోయి ముందే ఎందుకు లేదని నిలదీశారు. పీసీసీ కార్యదర్శి బండ శంకర్, డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, నాయకులు మేడిపల్లి సత్యం, కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కల్లెపెల్లి దుర్గయ్య, అశోక్, నేహాల్ ఉన్నారు.

మూడు పంటలు కావాలా.. మూడు గంటల కరెంట్ కావాలా?

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాలరూరల్: రాష్ట్రంలో మూడు పంటల విధానం కావాలా? కాంగ్రెస్ పార్టీ చెబుతున్నట్లు మూడు గంటల కరెంట్ కావాలా? అని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. సోమవారం జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ రైతు వేదిక వద్ద రైతులతో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం విద్యుత్ మోటార్లకు మీటర్లు పెడతామని రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో వ్యవసాయ రంగానికి ప్రాజెక్ట్ నుంచి నీరు ఇవ్వక.. 7 గంటల విద్యుత్ ఇస్తామని చెప్పి మూడు గంటలు కూడా ఇవ్వలేదని దుయ్యబట్టారు. కరెంట్ మోటార్లకు మీటర్లు పెట్టాలన్న బీజేపీకి, 24 గంటల కరెంట్ వద్దన్న కాంగ్రెస్‌కు రైతులు ప్రజలే బుద్ధి చెప్పాలని వారు కోరారు. రైతుబంధు, రైతుబీమా, ఉచిత కరెంట్ వంటి సేవలతో దేశానికి అన్నం పెడుతున్న రైతులను రాజును చేయాలన్నదే సీఎం కేసీఆర్ లక్ష్యమని అన్నారు. పేదల సంక్షేమం కోసం పనిచేస్తున్న ప్రభుత్వం బీఆర్‌ఎస్ అని పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ నక్కల రాధ, సింగిల్‌విండో చైర్మన్ మహిపాల్‌రెడ్డి, సర్పంచ్ ఏల్ల గంగనర్సు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆసీఫ్, పలువురు నాయకులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే, రైతులు

'గుణపాఠం చెప్పాలి'

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): వ్యసాయర రంగానికి 24 గంటల విద్యుత్‌పై విమర్శించే వారికి తగిన బుద్ధి చెప్పాలని రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు చీటి వెంకట్‌రావు కోరారు. రైతువేదికలో నిర్వహించిన రైతుసదస్సులో మాట్లాడారు. నాయకులు సుగుణాకర్‌రావు, భీమేశ్వరి, లక్ష్మారెడ్డి, గోపి ఉన్నారు.

కలెక్టరేట్ల ముట్టడి.. తాగునీటి కట్టడి

- 21 నుంచి పంచాయతీ సిబ్బంది ఆందోళన తీవ్రతరం
- ఉద్యోగ భద్రత, వేతన స్థిరీకరణ, బకాయిల విడుదలకు డిమాండ్
- మల్టీపర్పస్ విధానాన్ని రద్దుచేయాల్సిందేనని స్పష్టీకరణ
- వెట్టిచాకిరీ నుంచి విముక్తి కల్పించాలని వేడుకోలు
- స్వచ్ఛ సర్వేక్షణ్‌కు ఆటంకాలు

సాక్షిప్రతినిధి, కరీంనగర్: న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని గ్రామపంచాయతీ సిబ్బంది ప్రారంభించిన సమ్మె తీవ్రరూపం దాల్చనుంది. ఈనెల 21 నుంచి రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల ముట్టడికి కార్మిక, ఉద్యోగ సంఘాలు పిలుపునిచ్చాయి. ఇదే క్రమంలో అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల ఇళ్ల ఎదుట ధర్నాలు చేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం పారిశుద్ధ్య కార్మికులు మాత్రమే పాల్గొంటున్న ఈ సమ్మెలో త్వరలో కారోబార్, బిల్ కలెక్టర్, పంప్ డ్రైవర్, ట్రాక్టర డ్రైవర్, విద్యుత్ సిబ్బంది పాల్గొనేందుకు సిద్ధంగా ఉన్నారని కార్మిక, ఉద్యోగ సంఘాల జేఏసీలు స్పష్టంచేస్తున్నాయి. రాష్ట్రంలోని 12,769 గ్రామపంచాయతీల్లోని దాదాపు 50వేల మంది ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు పకడ్బందీ ప్రణాళిక రూపొందించారు.

పక్కా ప్రణాళికతో..

చాలాకాలంగా న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నా.. ఎలాంటి స్పందన లేకపోవడంతోనే తాముసమ్మెలోకి వెళ్లాల్సి వచ్చిందని కార్మిక సంఘాల నాయకులు స్పష్టంచేస్తున్నారు. 21న కలెక్టరేట్ల ముట్టడి అనంతరం గ్రామాల్లో తాగునీటి సరఫరా నిలిపివేయాలన్న ఆలోచనలో ఉన్నారు. వాస్తవానికి గ్రామపంచాయతీల్లో పనిచేసే సిబ్బందికి దాదాపు నాలుగు నెలలుగా వేతనాలు లేక అల్లాడుతున్నారు. దీనికి తోడు 12 రోజులుగా గ్రామ పంచాయతీ సిబ్బంది సమ్మె చేస్తుండడంతో పల్లెల్లో పారిశుద్ధ్యం పేరుకుపోయి వ్యాధులు విజృంభించే అవకాశం ఉంది. ఇప్పుడే గ్రామపంచాయతీల్లో స్వచ్ఛ సర్వేక్షణ్ కింద ఎంపికైన గ్రామాల్లో సర్వే కొనసాగుతోంది. సర్వేకు సహకరించాల్సిన పంచాయతీ సిబ్బంది, జేపీఎస్‌లు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటేనే స్వచ్ఛసర్వేక్షన్ సర్వే సజావుగా సాగనుంది. ఈ రెండింటిని దృష్టిలో ఉంచుకొని జిల్లా పంచాయతీ అధికారులు సమ్మె విరమించి విధుల్లోకి చేరాలని, జేపీఎస్‌ల క్రమబద్ధీకరణ అంశం రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ప్రక్రియ కొనసాగుతుందని డీపీవో వెల్లడిస్తూ వెంటనే విధుల్లోకి చేరేలా ఒత్తిడి తెస్తున్నారు.



సారంగాపూర్ : శిబిరంలో నిరసన తెలుపుతున్న గ్రామపంచాయతీ కార్మికులు

ఎందుకు కష్టాలు?

వాస్తవానికి ప్రతీ గ్రామపంచాయతీలో సిబ్బంది విషయంలో రికార్డులో సగం, రికార్డులో లేకుండా సగం మంది పనిచేస్తున్నారు. రికార్డులో ఉన్నవారికి ప్రస్తుతం రూ.8,500, లేని వారికి రూ.7,000 లేదా అంత కంటే తక్కువ వేతనం చెల్లిస్తున్నారు. ఈ సమయంలో ప్రభుత్వం 2019లో ప్రభుత్వం జీవో నెం.51ని విడుదల చేయడం వీరికష్టాలను మరింత పెంచింది. ఈ జీవో ప్రకారం.. 500 మంది జనాభా ఉన్న గ్రామ పంచాయతీకి ఒక ఉద్యోగిని తీసుకోవాలి. వారికి రూ.8,500 వేతనం చెల్లించాలి. అప్పటికి.. ఇప్పటికి జనాభా చాలా పెరిగింది. అందుకే, గ్రామపంచాయతీ అదనపు సిబ్బందిని తీసుకుంది. వారికి ఉన్నవారి వేతనాన్ని పంచుతు సర్దుబాటు చేస్తోంది. ఇది ఒకరకంగా వెట్టిచాకిరీ కిందకే వస్తుందని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. చాలాచోట్ల రూ.4 వేల కంటే తక్కువ వేతనం, సెలవులు లేకుండా విధులు నిర్వహిస్తున్నారు. ఉదాహరణకు 2001 జనాభా లెక్కల ప్రకారం.. 4000 జనాభా ఉన్నచోట ఎనిమిది మంది పనిచేయాలి. కానీ.. ఇపుడు ఆ గ్రామంలో జనాభా పదివేలకు చేరి ఉంటుంది. దీంతో 15 మంది వరకు సిబ్బంది అవసరం. దీంతో ఈ ఎనిమిదిమందికి రూ.8,500 చొప్పున రూ.68,000 వేతనం ఇవ్వాలి. కానీ.. రూ.4 వేల చొప్పున అదేవేతనాన్ని 15 మందికి పంచుతున్నారు. అంతేకాకుండా మల్టీపర్పస్ వర్కర్ విధానంతో అందరూ అన్నిపనులు చేయాలనడాన్ని కార్మికులు తప్పుబడుతున్నారు. విద్యావంతులు కారోబార్‌లుగా వ్యవహరిస్తున్నారు. కానీ.. వారితో మురికి కాలువలు తీయిస్తున్నారు. చాలాచోట్ల సర్పంచులు తమకునచ్చని కారోబార్లతో రోడ్లు ఊడ్పించడం, కాలువలు తీయించడం చేయిస్తున్నారు. దీంతో డిగ్రీ, పీజీ చదివిన కారోబార్ల ఆత్మగౌరవాన్ని ఇది దెబ్బతీస్తోంది. స్కిల్డ్ అన్ స్కిల్డ్‌ను ఒకే గాటిన కట్టడం సరికాదని వాదిస్తున్నారు. ఆకస్మికంగా మృతిచెందిన వారి కుటుంబాలకు ఎలాంటి పరిహారం అందడం లేదు. వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. దీంతో మల్టీపర్పస్ వర్కర్స్ నిరసనలు, దీక్షలు, ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేసి ఇదే సమయంలో డిమాండ్లను పరిష్కరించుకునేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీవ్రతరం చేశారు.

జిల్లా	జీపీలు	మల్టీపర్పస్ వర్కర్లు
కరీంనగర్	313	1397
జగిత్యాల	380	1534
పెద్దపల్లి	266	1108
సిరిసిల్ల	255	1222
మొత్తం	1,214	5,261

డిమాండ్లు ఇవే...

- పంచాయతీ సిబ్బంది అందరినీ పర్మినెంట్ చేసి ప్రత్యేక బడ్జెట్ కేటాయించి వేతనాలు ఇవ్వాలి.
- మినిమం బేసిక్‌ను రూ.19 వేలుగా వేతనంగా చెల్లించాలి. జీవో 60 ప్రకారం స్వీపర్లకు రూ.15600, పంప్ ఆపరేటర్లు, ఎలక్ట్రీషియన్లు, కారోబార్, బిల్‌కలెక్టర్లకు రూ.19,500 చెల్లించాలి.
- ప్రమాదంలో మరణించిన సిబ్బందికి రూ.10 లక్షల నష్టపరిహారం చెల్లించాలి.
- ప్రమాదంలో మరణించిన కార్మికుని దహన సంస్కారాలకు రూ.30 వేల ఆర్థికసాయం. కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం, ఇన్సూరెన్స్ సౌకర్యం వర్తింపజేయాలి.
- ఎనిమిది గంటల పనిదినాన్ని అమలుచేస్తూ వారంతపు సెలవులు, పండుగ సెలవులు అమలు చేయాలి.
- ఆదాయం ఉన్న పంచాయతీల్లో వేతనాల పెంపునకు అనుమతి ఇవ్వాలి.
- ట్రాక్టర్ డ్రైవర్లకు పంచాయతీల ద్వారానే డ్రైవింగ్ లైసెన్స్‌లు ఇప్పించాలి.
- అకారణంగా కార్మికులను తొలగించే కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు మానుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

ప్రభుత్వం దిగొచ్చేవరకూ ఉద్యమం



గ్రామపంచాయతీల్లో మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని అమలు చేస్తూ కార్మికులను శ్రమను దోచుకుంటున్న ప్రభుత్వం సమానపనికి సమాన వేతనం ఇవ్వాల్సిందే. 12 రోజులుగా సమ్మెచేస్తున్నా.. ప్రభుత్వం న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాల్సింది పోయి.. బెదిరింపులకు పాల్పడటం అప్రజాస్వామికం. ప్రభుత్వం దిగివచ్చే వరకు సమ్మెను ఉధృతం చేస్తాం.

– కొప్పుల శంకర్, గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మిక సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్

ఉద్యోగులుగా గుర్తించాలి



మానకొండూరు గ్రామ పంచాయతీలో 14 సంవత్సరాల నుంచి చాలీచాలని వేతనంతో జీవనం సాగిస్తున్నా.. ఇద్దరు పిల్లలు.. వచ్చే జీతం ఎటు సరిపోవడంలేదు. ప్రభుత్వం మా కష్టానికి తగ్గట్టుగా జీతం పెంచడంతో పాటు మమ్ముల్ని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి.

– జి.జగదీశ్వర్, జీపీ ఎలక్ట్రీషియన్, మానకొండూర్

క్లుప్తంగా

ఒకరి బలవన్మరణం

వేములవాడరూరల్: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన వేములవాడ రూరల్ మండలం జయవరం గ్రామంలో సోమవారం జరిగింది. గ్రామస్తులు, పోలీసుల వివరాలు.. కోనరావుపేట మండలం నిమ్మపల్లి గ్రామానికి చెందిన దేవయ్య (48) 30 ఏళ్ల క్రితం అత్తగారిల్లు జయవరానికి ఇల్లరికం వచ్చి వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇతడి ఒక్కగానొక్క కుమారుడు అనారోగ్యంతో మరణించడంతో మరదలి కుమారుడిని దత్తత తీసుకున్నాడు. దత్తత తీసుకున్న కొడుకు జల్సాలకు అలవాటుపడ్డాడు. ఎన్నిసార్లు చెప్పినా అతడిలో మార్పు రాకపోవడంతో పాటు నిమ్మపల్లిలో ఉన్న భూమిని అమ్మి డబ్బు తీసుకురావాలని దేవయ్యను వేధించేవాడు. దీంతో మనోవేదన చెందిన దేవయ్య ఇంటి వద్ద ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తమ్ముడు దప్పుల నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు. మృతుడికి భార్య ఉంది.

35 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



ముస్తాబాద్(సిరిసిల్ల): రేషన్ బియ్యం అక్రమ రవాణాపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు వరస దాడులు చేస్తూనే ఉన్నారు. మండలంలోని మోహినికుంట నుంచి సిద్దిపేట జిల్లా కేంద్రానికి తరలిస్తున్న 35 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ ఎస్సై మారుతి ఆధ్వర్యంలో సోమవారం వేకువజామున పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఎస్సై తెలిపిన వివరాలు.. ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు పక్కా సమాచారంతో మోహినికుంట నుంచి సిద్దిపేటకు టీఎస్01యూసీ 0027 నంబర్ గల అశోక్ లెల్యాండ్ వాహనంలో పీడీఎస్ బియ్యం సిద్దిపేటకు తరలిస్తుండగా పట్టుకున్నారు. సిద్దిపేటకు చెందిన కొండాపూర్ శ్రీనివాస్ మోహినికుంటకు చెందిన కడమంచి కనుకయ్య ఇంటి నుంచి 35 క్వింటాళ్ల బియ్యాన్ని వాహనంలో తరలిస్తున్నాడు. బియ్యం అక్రమంగా సేకరించిన కడమంచి కనుకయ్య, కొనుగోలు చేసిన కొండాపూర్ శ్రీనివాస్, డ్రైవర్ ఫరూక్, వాహనం ఓనర్ సిద్దిపేటకు చెందిన సాయి వివరాలను, బియ్యాన్ని స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించడం జరిగిందని ఎస్సై తెలిపారు. హెడ్‌కానిస్టేబుల్ తిరుపతి, పీసీలు శ్రీనివాస్, మహిపాల్, అక్షర్ తదితరులున్నారు.

పట్టాదారు పాసుపుస్తకాలేవి?

- భూ రిజిస్ట్రేషన్ జరిగి, మూడు నెలలైనా రైతులకు అందలే
- పంట రుణాలకు బ్యాంకర్ల ససేమిరా
- జిల్లాలో పరిస్థితి

సారంగాపూర్: రైతులు కొత్తగా ఇతరులు నుంచి కొనుగోలు చేసిన, వారసత్వంగా పట్టా మార్పిడి, గిఫ్ట్ డీడ్ ద్వారా పొందిన భూములకు నెలలు గడుస్తున్నా పట్టాదారు పాసుపుస్తకాలు అందడం లేదు. దీంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. ఏప్రిల్ నెల చివరి వారం నుంచి రిజిస్ట్రేషన్లు చేయించుకున్నవారికి మూడు నెలలు కావస్తున్నా పాసుపుస్తకాలు రావడం లేదు. ఫలితంగా బ్యాంకర్లు పంట రుణాలు ఇవ్వడానికి ససేమిరా అంటున్నారు.

సీసీఎల్ఏ నుంచి రావాలి..

భూ రిజిస్ట్రేషన్ ప్రక్రియ తహసీల్దార్ కార్యాలయంలో ఆన్‌లైన్ ద్వారా పూర్తవగానే రైతులకు అప్పటికప్పుడు రెవెన్యూ కార్యాలయాల్లోనే పట్టామార్పిడికి సంబంధించ ధ్రువపత్రాలు అందించారు. కానీ పట్టాదారు పాసుపుస్తకం మాత్రం హైదరాబాద్ సీసీ ఎల్ఏ నుంచి ముద్రించబడి రావాల్సి ఉంటుంది.



పట్టాదారు పాసుపుస్తకం

ప్రతి మండలంలో 100 మంది వరకు అంచనా

జగిత్యాల జిల్లాలో పట్టాదారు పాసుపుస్తకాలు రావాల్సినవారు ప్రతి మండలంలో 50 నుంచి 100 మంది వరకు ఉంటారని సమాచారం. రెవెన్యూ కార్యాలయాల్లో మాత్రం ఎంత మందికి పాసుపుస్తకాలు అందాలన్న దానిపై పూర్తిస్థాయిలో సమాచారం లేదు. కాగా, సారంగాపూర్ మండలంలో 372 మంది, బీర్‌పూర్ మండలంలో 183 మందికి పట్టామార్పిడి (కొనుగోలు, గిఫ్ట్ డీడ్, విరాసత్ ద్వారా) జరిగింది. వీరు తమకు పట్టామార్పిడి సమయంలో రెవెన్యూ కార్యాలయంలో అందించిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల ద్వారా రైతుబీమా, రైతుబంధు పథకాలకు దరఖాస్తు చేసుకున్నారు. ఐదెకరాల్లోపు భూమి ఉన్న రైతులందరికీ ఈ వానాకాలం రైతుబంధు కింద పంట పెట్టుబడి సాయం ఎకరాకు రూ.5 వేల చొప్పున అందింది.

బ్యాంకు రుణాలకు తప్పనిసరి

పట్టాదారు పాసుపుస్తకం ఉంటేనే దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలు ఇస్తామని బ్యాంకర్లు రైతులకు తేల్చిచెబుతున్నారు. తాము పెద్ద మొత్తంలో వ్యయం చేసి, భూమి కొన్నామని, పంట రుణాలు ఇవ్వకపోతే ఎలా అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వానాకాలం సీజన్‌కు సంబంధించి పంట రుణాలు తీసుకోవడానికి పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వకపోవడంతో అధికారుల తీరును తప్పు పడుతున్నారు.

గిఫ్ట్ డీడ్ చేయించుకున్న



నేను మా నాన్న నుంచి భూమిని గిఫ్ట్ డీడ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకున్న. ఆ సమయంలో మీసేవ ద్వారా నిబంధనల మేరకు డబ్బులు చెల్లించాను. ఇప్పటివరకు పాసుపుస్తకం రాకపోవడంతో పంట రుణం తీసుకోలేకపోతున్న.

– నైనాల అరవింద్, బట్టపల్లి

త్వరలోనే అందుతాయి



భూ రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులందరికీ పట్టాదారు పాసుపుస్తకాలు త్వరలోనే అందుతాయి. హైదరాబాద్‌లో ముద్రణ పూర్తయిన వెంటనే పోస్టు ద్వారా ఇంటికి వస్తాయి. ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందవద్దు.

– తహసీల్దార్ రవీందర్‌రావు, సారంగాపూర్

పెండింగ్ కేసులు త్వరగా పరిష్కరించాలి

- శిక్షల శాతం పెరిగేలా చూడాలి
- ఎస్పీ భాస్కర్



మాట్లాడుతున్న ఎస్పీ భాస్కర్

జగిత్యాల క్రైం: పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని, కోర్టు కేసుల్లో శిక్షల శాతం పెరిగేలా చూడాలని ఎస్పీ ఎగ్గడి భాస్కర్ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో కోరుట్ల, మల్యాల పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టిసారించి, పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొత్త కేసులతోపాటు పెండింగ్ కేసులను ఎప్పటికప్పుడు సమీక్షించడం ద్వారా వాటి సంఖ్య తగ్గించాలని చెప్పారు. కోర్టుల్లో న్యాయమూర్తులతో చర్చించి, కేసుల పురోగతి తెలుసుకోవాలని పేర్కొన్నారు. విచారణ సందర్భంగా అధికారులందరూ చురుగ్గా పని చేయాలన్నారు. నేరాల నియంత్రణకు సొసైటీ ఫర్ పబ్లిక్ సేఫ్టీలో భాగంగా ప్రతి పట్టణంలో, కాలనీల్లో, గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రజలకు, వ్యాపారులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రమాదాల నివారణకు రోడ్డు భద్రతపై అవగాహన సమావేశాలు నిర్వహించాలని చెప్పారు. దొంగతనాలు జరగకుండా రాత్రిపూట గస్తీ, బీట్లు, పెట్రోలింగ్ నిర్వహించాలని, డయల్ 100 కాల్స్‌కు వెంటనే స్పందించి, ఆపదలో ఉన్నవారికి తక్షణ సహాయం అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్పీలు రవీందర్ రెడ్డి, శ్రీనివాస్, సీఐలు కోటేశ్వర్, ప్రవీణ్‌కుమార్, ఎస్సైలు, డీసీఆర్బీ, ఐటీకోర్ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం తాగి డ్రైవింగ్ చేస్తే జైలుకే..

మద్యం తాగి వాహనలు నడిపితే జైలుకు వెళ్లడం తప్పదని ఎస్పీ భాస్కర్ హెచ్చరించారు. జిల్లాలో రెండ్రోజుల పాటు డ్రంకెన్‌డ్రైవ్, ర్యాష్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్, విత్ అవుట్ నంబర్‌ప్లేట్, ట్రిపుల్ రైడింగ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈసందర్భంగా పట్టుబడిన 40 మంది వాహనదారులకు స్థానిక ట్రాఫిక్ శిక్షణ కేంద్రంలో సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ, మద్యం తాగి వాహనాలు నడపవద్దని, పొరపాటున ప్రమాదం జరిగితే కుటుంబం రోడ్డున పడుతుందన్నారు. యజమాని లేని కుటుంబం ఛిన్నాభిన్నం అవుతుందని తెలిపారు. అందరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. మైనర్లు వాహనం నడిపితే వాహన యజమానిపై కేసు నమోదు చేస్తామని అన్నారు.

రిజిస్ట్రేషన్ లేకుంటే కేసులు..

నిబంధనలకు విరుద్ధంగా నంబర్ ప్లేట్లు ఏర్పాటు చేసినా, ఈ చలాన్ నుంచి తప్పించుకునేందుకు ఫ్యాన్సీ నంబర్లు, తప్పుడు నంబర్లు చేసినా చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. వివిధ డిజైన్లు, నంబర్లు గుర్తించకుండా రాతలు ఉన్నా కేసులు నమోదు చేస్తామన్నారు. జిల్లా ప్రజలు పోలీసులకు సహకరించి తమ వాహనాల నంబర్ ప్లేట్లు నిబంధనల ప్రకారం బిగించుకోవాలని సూచించారు. అనంతరం మద్యం తాగి వాహనాలు నడపబోమని, ట్రాఫిక్ నియమాలు పాటిస్తామని, హెల్మెట్ ధరిస్తామని వాహనదారులతో ఎస్పీ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు రవీందర్‌కుమార్, రవీందర్‌రెడ్డి, ఆర్ఐ నవీన్, ట్రాఫిక్ ఎస్సై రాంచంద్రం, ఆర్ఎస్సై కృష్ణ, ట్రాఫిక్, ఐటీకోర్ సిబ్బంది పాల్గొన్నారు.

గల్ఫ్ వెళ్లినవారికి రైతుబీమా వర్తింపజేయాలి

- టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్ నరేశ్‌రెడ్డి

కథలాపూర్: ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లినవారికి రైతుబీమా వర్తింపజేయాలని టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్ సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో సోమవారం జరిగిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో ఈ అంశంపై చర్చించినట్లు ఆయన విలేకరులకు తెలిపారు. గల్ఫ్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని, కనీసం రైతుబీమా పథకం వర్తింపజేసే విషయంలోనైనా ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల్లో జరిగిన వివక్ష వల్లే ఉద్యమాలతో ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందని, గద్దెనెక్కిన బీఆర్ఎస్ ప్రభుత్వం వాటిని విస్మరించిందని ఆరోపించారు.

జీవితంపై విరక్తితో వృద్ధుడి ఆత్మహత్య

ధర్మారం(ధర్మపురి): మండలంలోని కానంపెల్లి గ్రామానికి చెందిన వేల్పుల పోచయ్య(60) అనే సింగరేణి రిటైర్డ్ కార్మికుడు ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై సత్యనారాయణ వివరాల ప్రకారం.. పోచయ్య సింగరేణి కార్మికుడిగా పని చేసి, రెండేళ్ల క్రితం రిటైర్మెంట్ పొంది, స్వగ్రామం వచ్చాడు. ఆయనకు ముగ్గురు కుమారులు కాగా భార్య 16 ఏళ్ల క్రితమే చనిపోయింది. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది, ఆదివారం సాయంత్రం ఇంట్లో ఉన్న క్రిమిసంహారక మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పోచయ్య చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడి కుమారుడు మల్లేశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జగిత్యాలలో వ్యభిచారం గుట్టు రట్టు

- ఆరుగురి అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న సీఐ నటేశ్

జగిత్యాల క్రైం: జగిత్యాల పట్టణ శివారులోని అంతర్గాం రోడ్‌లో వ్యభిచారం నిర్వహిస్తున్న ఇద్దరితోపాటు ముగ్గురు యువతులు, ఒక విటున్ని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ నటేశ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. సోమవారం మధ్యాహ్నం అంతర్గాం రోడ్‌లోని ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నారని పోలీసులకు పక్కా సమాచారం వచ్చింది. వెంటనే తనిఖీలు చేపట్టగా వ్యభిచారం నిర్వహిస్తున్న ఇద్దరితోపాటు ముగ్గురు యువతులు, ఒక విటుడు పట్టుబడ్డారు. వారిని అరెస్టు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

ఎంపీ పరామర్శ



నివాళి అర్పిస్తున్న ఎంపీ అర్వింద్, శ్రావణి

జగిత్యాల: బీజేపీ సీనియర్ నాయకుడు ఎల్.చంద్రశేఖర్ తండ్రి ఎల్లీరామ్ ఇటీవల మరణించగా నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ సోమవారం ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట పార్టీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి, నాయకులు మదన్‌మోహన్, తిరుపతిరెడ్డి, పడాల తిరుపతి, వీరబత్తిని అనిల్ ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెగడపల్లి: మండలంలోని వెంగళాయిపేటకు చెందిన ఆత్మకూరి స్వామి(52) చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 2న రాత్రి వెంగళాయిపేట ప్రధాన రహదారిపై నడుచుకుంటూ వెళ్తున్న స్వామిని అదే గ్రామానికి చెందిన చెట్ల శ్రీనివాస్ బైక్‌పై వచ్చి, ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఇద్దరూ గాయపడి, చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రిలో చేరారు. అక్కడ చికిత్స పొందుతూ స్వామి సోమవారం మృతిచెందాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు.

కోరుట్లలో గుండెపోటుతో జర్నలిస్ట్..



కిరణ్ (ఫైల్)

కోరుట్ల: పట్టణానికి చెందిన జర్నలిస్ట్ గుండేటి కిరణ్(36) సోమవారం గుండెపోటుతో మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. ఉదయం పలు కార్యక్రమాల్లో పాల్గొని, ఇంటికి వచ్చాడన్నారు. గుండెలో నొప్పిగా ఉందని కుటుంబసభ్యులకు చెప్పడంతో సమీపంలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారని చెప్పారు. పరీక్షించిన వైద్యుడు అప్పటికే అతను మృతి చెందినట్లు తెలిపారన్నారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. కిరణ్ మృతి పట్ల పలువురు రాజకీయ నాయకులు, అధికారులు, పాత్రికేయులు సంతాపం వ్యక్తం చేశారు.

అనుమానాస్పదస్థితిలో వృద్ధుడు..



మల్లయ్య మృతదేహం

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని గుండన్నపల్లి గ్రామానికి చెందిన మేడుదుల మల్లయ్య (85) అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఎస్సై మహేందర్ సోమవారం రాత్రి తెలిపిన వివరాలు.. మల్లయ్య కాలు విరగడంతో కొంతకాలంగా మంచానికే పరిమితం అయ్యాడు. కాగా ఈ నెల 16న తన తండ్రి వద్దకు వెళ్లి చూడగా చనిపోయి ఉన్నాడని, మృతిపై అనుమానం ఉందని కుమారుడు మేడుదల ఎల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

ఓ వ్యక్తి వీడియో వైరల్

మేడుదుల మల్లయ్య అనే వృద్ధుడి మృతిపై ఓ వ్యక్తి వీడియో వైరల్‌గా మారింది. రైతుబీమా డబ్బుల కోసమే వృద్ధుడిని హత్య చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఓ వ్యక్తి మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో గండన్నపల్లి గ్రామంలో వృద్ధుడి మృతి చర్చనీయాంశంగా మారింది. ఈనేపథ్యంలో వేములవాడ రూరల్ సీఐ బన్సిలాల్ గ్రామంలో విచారణ చేపట్టారు.

‘మాకు ఉద్యోగ భద్రత కల్పించాలి’



ఎంపీ సురేశ్‌రెడ్డి, అధికారులకు వినతిపత్రం ఇస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

జగిత్యాల: సమగ్ర శిక్షలో పని చేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పేస్కేల్ అమలు చేయాలని తెలంగాణ సమగ్ర శిక్ష జాయింట్ యాక్షన్ కమిటీ జగిత్యాల జిల్లా నాయకులు కోరారు. ఈ మేరకు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు కార్యాలయంలో ఎంపీ సురేశ్‌రెడ్డి, అధికారులకు సోమవారం వినతిపత్రం అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా 21 వేల మంది ఉద్యోగులం ఉన్నామని, విద్యాశాఖలో కీలకంగా ఉంటూ విద్యాభివృద్ధికి నిరంతరం తమవంతు కృషి చేస్తున్నామని తెలిపారు. రోస్టర్, మెరిట్, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా క్రమబద్ధీకరణకు అర్హత కలిగి ఉన్నామని అన్నారు. అయినా క్రమబద్ధీకరణకు నోచుకోవడం లేదని, ఉద్యోగ భద్రత లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కుడకల రవీందర్, అజయ్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పాలనలో రైతుల కష్టాలు తీరినయ్

- డీసీఎమ్మెస్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి



మాట్లాడుతున్న చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి

ధర్మపురి: బీఆర్ఎస్ పాలనలో రైతుల కష్టాలు తీరాయని డీసీఎమ్మెస్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ధర్మపురి పట్టణంలోని రైతు వేదికలో సోమవారం రైతులతో చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పాలకుల హయాంలో రైతులు ఎన్నో కష్టాలను అనుభవించారని, కరెంటు, సాగు నీరు లేక పంటలు ఎండిపోయి ఆత్మహత్య చేసుకున్న సందర్భాలున్నాయని తెలిపారు. ఎరువుల కోసం రోజుల తరబడి క్యూలైన్లలో ఉండి, విసుగెత్తిపోయారని పేర్కొన్నారు. గతంలో అలాంటి పాలన అందించిన పార్టీల నాయకులు నేడు బీఆర్ఎస్‌పై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ రైతుల కోసం 24 గంటలు కరెంటు, సాగునీరు అందిస్తున్నారని, ఎరువులకు కొదవ లేదు పేర్కొన్నారు. ఓర్వలేకనే రైతాంగానికి 3 గంటలే కరెంటు ఇవ్వాలని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, ఎంపీపీ చిట్టిబాబు, జెడ్పీటీసీ సభ్యురాలు బత్తిని అరుణ, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్, రైతుబంధు సమితి అధ్యక్షుడు భీమన్న, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ అవార్డ్స్ మానక్‌కు దరఖాస్తుల ఆహ్వానం



డీఈవో జగన్మోహన్‌రెడ్డి

జగిత్యాల: నూతన ఆవిష్కరణలకు ప్రోత్సహించేందుకు నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్, కేంద్ర శాస్త్ర సాంకేతిక మండలి సంయుక్తంగా ఏటా ఇన్‌స్పైర్ అవార్డ్స్ మానక్ నిర్వహిస్తున్నాయని డీఈవో జగన్మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో శాస్త్రీయ నైపుణ్యం పెంపొందించేందుకు ఇది వేదికగా నిలుస్తుందన్నారు. 6 నుంచి 10వ తరగతి చదువుతున్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. భౌతిక, జీవ, గణితశాస్త్ర ఉపాధ్యాయుల సహకారంతో WWW.INSPIREAWARDSDST.GOV.IN లో ఆగస్టు 31లోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ప్రతి పాఠశాలలో ఐడియా బాక్స్ ఏర్పాటు చేసి, వచ్చిన మంచి ఆలోచనల్లో ఐదింటిని ఎంపిక చేసి, గైడ్ ఉపాధ్యాయులు నామినేషన్లు వేయాలన్నారు. ఎంపికైన ప్రాజెక్టులకు రూ.10 వేల చొప్పున విద్యార్థుల ఖాతాలో ప్రభుత్వం జమ చేస్తుందని పేర్కొన్నారు. జాతీయస్థాయిలో ఉత్తమంగా రాణిస్తే రాష్ట్రపతి భవన్‌లో ప్రదర్శించే అవకాశం దక్కుతుందని తెలిపారు.

ఎమ్మెల్యే ఇంటి ఎదుట నిరసన



ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు ఇంటి ఎదుట బైఠాయించిన కార్మికులు

- ఆందోళనకు దిగిన మధ్యాహ్న భోజన కార్మికులు
- పెండింగ్ బిల్లులు చెల్లించాలి : ఏఐటీయూసీ నేత రాములు



ఎంపీ అర్వింద్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

మెట్‌పల్లి(కోరుట్ల): తమ డిమాండ్లను పరిష్కరించాలని కొన్ని రోజులుగా సమ్మె చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు ఇంటి ఎదుట ఆందోళనకు దిగారు. స్థానిక ఆర్డీవో కార్యాలయ ఆవరణలోని సమ్మె శిబిరం నుంచి ర్యాలీగా బయలుదేరి ఎమ్మెల్యే ఇంటికి చేరుకొని అక్కడ బైఠాయించారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు మాట్లాడుతూ, ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో కార్మికులు అప్పులు చేసి విద్యార్థులకు భోజనం పెడుతున్నారన్నారు. చాలీచాలనీ వేతనాలతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి ప్రతినెలా సకాలంలో బిల్లులు చెల్లించాలని, వేతనాలను పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉస్మాన్‌తోపాటు సంఘం అధ్యక్షురాలు సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీకి వినతిపత్రం..

పట్టణంలో మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె శిబిరాన్ని ఎంపీ అర్వింద్ సందర్శించారు. కార్మికులు ఆయనకు వినతిపత్రం అందజేశారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆయనకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఫోన్ చోరీ.. రూ.1.95 లక్షలు స్వాహా

సిరిసిల్లక్రైం: సిరిసిల్ల పాతబస్టాండ్‌లో ఫోన్ చోరీ చేసిన నిందితుడు ఏకగా రూ.1.95 లక్షలు విత్‌డ్రా చేసుకున్న విషయంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడి వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లాకు చెందిన రత్నాకర్ సిరిసిల్లలో బస్సు డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం విధులు ముగించుకుని కామారెడ్డి వెళ్లేందుకు సిరిసిల్ల పాతబస్టాండ్‌లో బస్సు ఎక్కాడు. జేబులో చూసుకునే సరికి అతడి ఫోన్ కనిపించలేదు. పరిసర ప్రాంతాల్లో అడిగినా లాభం లేకపోవడంతో తనకు తెలిసిన విధానంలో ఫోన్ నంబర్ బ్లాక్ చేయడానికి ప్రయత్నించాడు. బ్యాంకు అకౌంట్స్ నిలుపుదల చేయడానికి ప్రయత్నం చేసినా మరుసటి రోజు ఆదివారం కావడంతో కుదరలేదు. ఆదివారం మధ్యాహ్నం వరకు కొత్త సిమ్ తీసుకుని యాక్టివేషన్ కాగానే అతడి సెల్‌కు రూ.1.95 లక్షలు విత్‌డ్రా జరిగినట్లు మెస్సేజ్ వచ్చింది. అంతేకాదు గుంటూరు జిల్లాలో నిందితుడు ఓ ఆన్‌లైన్ సెంటర్‌లో రూ.50 వేలు తీసుకునే సమయంలో సెంటర్ నిర్వాహకుడికి అనుమానం వచ్చి ఆధార్ కావాలని అడిగాడు. అదే సమయంలో లింకు ఉన్న రత్నాకర్ నంబర్‌కు కాల్ చేశాడు. దీంతో తన ఫోన్ పోయిందని, అతడికి డబ్బు ఇవ్వవద్దని ప్రాధేయపడడంతో సెంటర్ నిర్వాహకుడు నిందితుడిని పట్టుకునేందుకు ప్రయత్నించగా పరారయ్యాడు. కాగా బాధితుడు సోమవారం బ్యాంకుకు వెళ్లి ఖాతా నిలుపుదల చేయాలని అధికారులను కోరాడు. కానీ అప్పటికే లక్షల సొమ్ము పోయిందని, దీనిపై సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసి న్యాయం పొందుతానని బాధితుడు ఆవేదనతో తెలిపాడు.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్

- ఒకేరోజు మూడిళ్లలో చోరీ



గంభీరావుపేట(సిరిసిల్ల): తాళం వేసి ఉన్న ఇళ్లనే దొంగలు టార్గెట్ చేస్తున్నారు. వరుసగా జరుగుతున్న దొంగతనాలతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మండలకేంద్రంలో సోమవారం ఒకే వీధిలో మూడిళ్లలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. పిట్ల శ్రీమతి, ముత్తయ్యగారి శ్రీనివాస్, మహేష్ ఇళ్లలో చోరీలు జరిగాయి. ఎల్లారెడ్డిపేట సీఐ మొగిలి, ఎస్సై మహేష్ ఘటనా స్థలాలను పరిశీలించారు. క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్‌లతో తనిఖీలు చేపట్టి, సీసీ ఫుటేజీలు పరిశీలిస్తున్నారు. శ్రీనివాస్ ఇంటిలో దాదాపు 13 తులాల బంగారం, 30 తులాల వెండి, శ్రీమతి ఇంటిలో హుండీ డబ్బులు, ఎలక్ట్రిక్ వస్తువులను దొంగలు ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. దొంగతనాల నియంత్రణకు పోలీసులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. వారం క్రితమే ప్రముఖ దైవ క్షేత్రం రామాలయం, ఆలయ అర్చకుడి ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు.